అన్నాడు సదాశివరావు. "ఒక డాక్టరుగారు ఒక పేషంటుని పరీక్ష చేస్తూ, 'ఏదీ, నాలిక జాపు, ఇంకా జాపు, - అదేంటి, లోపల?... ఏదో స్టాంపులాగా ఉందే?' అన్నాడట. దానికా పేషంటు, 'అమ్మా! ఈ స్టాంపు ఇక్కడుందా? ఉదయం నుంచీ వెతుక్కు చస్తున్నాను!' అన్నాట్ట. ఈ కార్టూన్ 1946లో ఒక పత్రికలో వచ్చిందని మా నాన్నగారు చెప్పేరు." ★

# 64. ముప్ఫయి ఏళ్ళ అనంతరం

నేను గుంటూరు జిల్లాలో పని చేస్తూ వుండిన రోజుల్లో ఒకసారి ఒంగోలు ప్రాంతంలో ఉన్న అమ్మనబ్రోలు అనే వూరికి క్యాంపు వెళ్లవలసి వచ్చింది. ఒంగోలు సబ్‌కలెక్టరు గారిని చూసే పనికూడా ఉంది. ముందుగా ఒంగోలు వెళ్లి సబ్‌కలెక్టర్‌గార్ని చూసేసి అక్కణ్ణుంచి అమ్మనబ్రోలు వద్దామని నేను వేసుకున్న ప్లాన్; ఒంగోలు తాలూకా ఆఫీసులో పనిచేస్తూ వుండిన సీతారామయ్య ఉన్నట్టుండి గుంటూరు రావడంతో తారుమారయింది. "నాక్కూడా అమ్మనబ్రోల్లో పనుంది. ఇద్దరం అమ్మనబ్రోలు వెళిపోదాం. ఈ సాయంకాలం చేరుకుంటాం కదా. మీ ఇనస్పెక్షన్ రేపు ఉదయం చేసుకోండి. ఈలోపుగా నాపన్లు చక్కబెట్టుకుంటాను. ఇద్దరం కలిసి రేపు సాయంకాలానికి ఒంగోలు చేరుకోవచ్చు" అని అతను సలహా ఇచ్చేడు.

"ఆన్‌డ్యూటీ మీద" వెళ్లాను కనక ట్రావెలర్స్ బంగళాలో బసచేసేను. మర్నాడు నేను చేయవలసిన ఇనస్పెక్షన్‌కి కబురు పెట్టడం మందీ మార్బలాన్నీ మోపుచెయ్యడం యివన్నీ సీతారామయ్య ఆ రాత్రిలో పూర్తి చేసేడు. నా వెంట డ్యూటీ మీద వచ్చిన మా ఆఫీసు ప్యూన్ నాయరు సాయంతో.

తెల్లవారి లేచేటప్పటికి బంగళా ఆవరణలో జీపు నిలబెట్టి వుంది. వరండాలో ఉన్న వాచ్‌మన్‌ని పిల్చి అడిగితే "సబ్‌కలట్రుగారు రాత్రి బాగా పొద్దుపోయాక వచ్చారండి" అని చెప్పేడు. "అయ్యగారు నిదరబోతున్నారండి. ఏడున్నరకి లెగుస్తారంట."

ఇప్పుడెలా వుందో తెలియదు గాని, ఆరోజుల్లో అమ్మనబ్రోలు ట్రావెలర్సు బంగళా ప్రాంతంలో ఎక్కడా కాఫీహోటళ్లుగాని, కనీసం "బడ్డీ టీకొట్టు", "పాక విలాస్-" ఏదీ కూడా వుండేది కాదు. అంచేత మా నాయర్ నాకు టిఫినూ కాఫీ తేవడానికి ఊళ్లోకెడుతూంటే "ఎందుకయినా మంచిది; కొంచెం ఎక్కువ తీసుకురా" అని చెప్పేను. సబ్ కలెక్టర్‌గారు లేచేసరికే వచ్చేశాడు చెప్పినవన్నీ కట్టించుకుని.

నేననుకున్నంతా అయింది. సబ్‌కలెక్టరు గారు లేచి మొహం కడుక్కుని స్నానం చేసి ఇవతలి కొచ్చి కూర్చునే సరికి కూడా కరణం గారికి కబురు చెప్పడానికి వెళ్లిన ఆయన ప్యూన్‌గాని, జీపు డ్రయివరు గాని రాలేదు. వాచ్‌మన్ నేనున్న గది తలుపు తెరుచుకుని లోపలికొచ్చి "ఐగారు లేచేరండి. వారి ప్యూన్ కర్ణంగారింటికెళ్లి ఇంకా రాలేదండి. టిఫినూ కాఫీ కోసం నాయరు గార్ని పంపించండయ్యా" అన్నాడు.

"తెచ్చాంగా" అన్నాడు మా నాయరు.

నేను వరండాలో కొచ్చాను. సబ్ కలెక్టరుగారు ఈజీ చేర్ మీద "ప్లాంకు" వేసుకుని

కాగితాలు పరుచుకుని చూసుకుంటున్నారు. నమస్కారం చేసి పరిచయం చేసుకున్నాను. "మీరు కొత్తగా జాయినయ్యేరని తెలిసినా ఇంతకంటే ముందు మీదర్శనం చేసుకోలేకపోయానండి. గత నెల 29ని మీరు గుంటూరికి కాన్ఫరెన్స్ కొచ్చేరు గాని ఆరోజు నేను సత్తెనపల్లిలో ఉండిపోయానండి. ఇదుగో ఇవాళ ఇక్కడ ఇనస్పెక్షన్ అయిపోయాక ఒంగోలు వచ్చి కలుద్దామనుకున్నానండి. ఈ రాత్రికి ఒంగోలు చేరుకుంటానండి.''

"ఒంగోల్లో ఇంకేమైనా పనుందా?''

"లేదండి. కేవలం మిమ్మల్ని చూడాలనే వద్దామనుకున్నానండి.''

"ఇక్కడ నన్ను చూసేశారుగా. అంచేత ఒంగోల్లో ఏమీ పనిలేకపోతే ఇక్కణ్ణించి గుంటూరు వెళ్లిపోండి. మర్యాదల కోసం టైమ్ వేస్ట్ చెయ్యకండి'' అని నవ్వు మొహంతోనే అయినా కటువుగానే చెప్పేరాయన.

అక్కడితో అయిపోలేదు.

వాచ్‌మనూ, మా నాయరూ కూబడలుక్కుని నేను బసచేసిన గదిలో ఉంచిన ఇడ్లీల కేరియరూ, కాఫీ ఫ్లాస్కూ ఆయన బసచేసిన గదిలోకి రవాణా చేసేరు. "సార్, టిఫినూ కాఫీ రెడీ సార్'' అని ఆయనతో చెప్పేడు వాచ్‌మన్.

"ఓకే. కారీ ఆన్!'' (సరే, నీ పనిచూసుకో) అని నాకు చెప్పేసి సబ్ కలెక్టర్‌గారు లోపలికి వెళ్లేరు.

కొంతసేపు గడిచేక నా మందీ మార్బలం రావడంతో నేను ఇనస్పెక్షన్‌కి బయలుదేరాను.

"థాంక్యూ; మిస్టర్ గోపాలన్; మీరు తెప్పించిన ఇడ్లీ కాఫీ చాలా బావున్నాయి. ఐ ఎంజాయ్‌డ్ దెమ్'' అని సబ్ కలెక్టరుగారు ప్రత్యేకంగా నన్ను ఆపి చేప్పేరు.

"ఆనందం నాది సార్'' అని నమస్కారంచేసి బంగళా ఆవరణ దాటేను.

నా ఆనందం ఎంతోసేపు నిలవలేదు. ఇనస్పెక్షన్ అయిపోయాక బంగళాకి వస్తూ మళ్లీ అక్కడికెళ్లి కారేజీ పంపించి భోజనం తెప్పించుకోడం ఎందుకులే అన్న ధోరణిలో హోటల్ దగ్గిర ఆగి భోజనం చేసేను. అక్కడ డబ్బు చెల్లిస్తున్న సమయంలో నాయర్: "నా దగ్గిర డబ్బు వుంది సార్. ఉదయం సబ్ కలెక్టర్ గారు, టిఫిన్ కాఫీ కోసం ఎంత ఖర్చు చేశావని పలకరించి అణా పైసలతో సహా లెక్కకట్టి ఇచ్చేశారు సార్'' అన్నాడు. "ఎందుకు పుచ్చుకున్నావు? నాతో చెప్పలేకపోయావా?'' అని అడిగాను. "మీ సర్వేయర్ గారు కేంప్ వచ్చారు; నేను కూడా క్యాంపే వచ్చాను. వారికి ఇచ్చినట్టే ప్రభుత్వం నాకు కూడా ప్రయాణపు భత్యం ఇస్తారు. నాకు వారూ పెట్టరాదు, వారికి నేనూ పెట్టరాదు. నీవు కూడా డ్యూటీ మీద క్యాంప్ వచ్చేవు కదా; నీ పై అధికారి కదా అని వారికి నువ్వు నీ డబ్బుతో టిఫిన్ కాఫీ తెచ్చావా? - అంటూ నవ్వుతూనే చివాట్లు పెట్టేరండి. పుచ్చుకునే దాకా వదల్లేదు'' అన్నాడు. నాయర్.

ఆ సాయంకాలం నా ఇనస్పెక్షన్ రిపోర్టు కార్బన్ కాపీ సబ్ కలెక్టరు గారికి స్వయంగా అందజేస్తూ "అయామ్ సారీ సార్. ఉదయం తమరికి నేను ఆతిథ్యం ఇచ్చేననుకొని సరదా పడ్డాను'' అన్నాను.

"అదుగో, అక్కడే నాకు ఈ వ్యవస్థతో పేచీ. మీ కలెక్టరు గారి నుండో, వారితాత ముత్తాతలైన నవాబుల నుండో, లేకపోతే ఈస్టిండియా కంపెనీ వారసులుగా వచ్చిన బ్రిటిష్ బ్యూరోక్రాట్లనుండో మనం సంప్రదాయాలను రూపొందిచుకోనవసరం లేదు." అన్నారాయన. "ఎనీవే; నా ఫ్యాన్ నాకు కూతవేటు దూరంలో లేని వేళప్పుడు మీ పలుకుబడి ఉపయోగించి నాకు సేవచేసేరు. దానికి నా కృతజ్ఞతలు. వస్తారా? మా జీప్‌లో ట్రంక్ రోడ్డుమీద దించేస్తాను; అక్కణ్ణించి మీరు బస్సులో గుంటూరు వెళ్లిపోవచ్చు" అని ఆఫర్ చేసేరు.

"లేదు సార్; థాంక్యు సార్. నేను రైల్లో వెళిపోతాను."

✧✧✧

నాటికి నేడు; అంటే ముప్ఫయ్యేళ్ల తరవాత -

మా తమ్ముడు గారి అల్లుడు హైదరాబాదులో ఒక చిన్న ఇండస్ట్రీ పెడదామనుకుంటున్న సందర్భంగా ఒకానొక క్లియరెన్స్‌కోసం ప్రభుత్వంలో ఒక శాఖలో ఉన్నతాధికారి ఒకర్ని ఆశ్రయించవలసి వచ్చింది. "ఆయన పేరు రామనాథ అయ్యంగార్‌ట" అని అడ్రసూ టెలిఫోన్ నెంబర్లూ ఇచ్చి; "ఇంటికి వెళ్లి కనిపిస్తే పని జరుగుతుందంటున్నారు; ఈలైన్‌లో వారి దయవల్ల స్థిరపడినవాళ్లు. కాని అంత పెద్ద వారితో ఎలా మాట్లాడాలో నాకు తెలియదు. మీరు మాట్లాడండి. వారు ఎలా చెప్తే అలా చెయ్యడానికి నేను సిద్ధమే." అన్నాడు.

రామనాథ అయ్యంగార్ అంటే ఆనాటి ఒంగోలు సబ్‌కలెక్టర్ గారేనని గ్రహించడానికి నాకు ఎంతో సేపు పట్టలేదు. "ఆయన కరక్టుగా రూలు ప్రకారం పోయే వాడే తప్ప నువ్వు చెప్పినట్టు ఇంటికెళ్ళి కనిపించడాలూ, ఎలా చెప్తే అలా చెయ్యడాలూ ఉండవు ఆయన దగ్గిర. నువ్వు చెప్పింది రైటు కాదల్లుడూ." అన్నాను. "కావాలంటే నా క్లాస్‌మేట్ సహదేవరావు ఉన్నారు కదా; రామనాథ అయ్యంగార్ కంటె సీనియర్; అఫ్‌కోర్స్; రిటైరయిపోయారనుకో - ఆయన చేత రికమెండ్ చేయిస్తాను!" అని ఆఫర్ చేసేను.

ఇద్దరం సహదేవరావు దగ్గిరికి వెళ్లాం.

"పది రూపాయలిస్తే పుచ్చుకోడు గాని పదివేలిస్తే ఎందుకు పుచ్చుకోడు? అయినా, ఒపీనియన్సు అప్పుడపుడు సడలించుకుంటూ, అవసరమైతే మార్చుకుంటూ ఉంటారు కొందరు. నువ్వు చెప్పిన అమ్మనబ్రోలు ఎపిసోడ్‌లో అతని వయస్సు 28, ఇప్పుడు 58, నలభై ఐదేళ్లు దాటాక ప్రతి మనిషికీ ఆశలు పెద్దగా బాధించకపోయినా బాధ్యతలు బాధిస్తాయి. మెడ్రాసులో కట్టుకున్న ఇల్లు కాస్తా అల్లుడు అక్కడ స్థిరపడ్డంతో చెయ్యి జారిపోయింది. కొడుక్కేమో చెప్పుకోదగ్గ ఉద్యోగం రాలేదు. కూడబెట్టుకున్నదంతా అమ్మాయి పెళ్లికీ ఆ (మద్రాసు) ఇంటికీ సరిపోయింది. ఇప్పుడు ఈ హైదరాబాదులో స్థలమైతే వుందిగాని ఇల్లు కట్టాలంటే-" అని ఆగాడు సహదేవరావు.

"అందుకేనండి. తమరు వారి అభిప్రాయం ఇంతా అని కనుక్కుని చెప్తే-" అన్నాడు మా తమ్ముడి అల్లుడు తన కాగితాలు అక్కడ పరిచి.

★